
పర్యావరణ పరిరక్షణ.. **బాధ్యత**
వన్యజీవి రాయబారి, క్రికెటర్ అనిల్ కుంబ్లే
మంత్రి ఖండ్రెతో కుంబ్లే
7

పెద్దల తిరస్కారం..!

● ఎమ్మెల్సీల జాబితాను వెనక్కి పంపిన అధిష్ఠానం ● ఓడిన వారికి అవకాశం ఇవ్వడం సరికాదని సూచన ● మైనార్టీ కోటాలో ముస్లింలకే అవకాశం ఇవ్వడంపై ఆగ్రహం



బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో ఖాళీగా ఉన్న నాలుగుస్థానాలను భర్తీ చేసేందుకు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ పంపిన జాబితాకు అధిష్ఠానం తిరస్కరించింది. దీంతో రాష్ట్ర నాయకులకు అధిష్ఠానం నుంచి ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. ప్రస్తుతం పరిషత్‌లో 4స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేసే విషయంలో దాదాపు కొన్ని నెలలకాలంగా రాష్ట్రముఖ్యనేతలు తర్జనభర్జన పడుతున్నారు. సుమారు నెలరోజులక్రిందట సీఎం, డీసీఎంలు వేర్వేరుగా జాబితాలను ఢిల్లీ నేతలకు పంపారు. అయితే అగ్రనేతలు రెండు జాబితాలను తిరస్కరించినట్లు తెలుస్తోంది. పూర్తిగా పక్కనపెట్టారా..? లేదా పాక్షికంగా జాబితాలోని ఒకటిరెండు పేర్లకు అవకాశం ఇస్తారా..? అనేది ప్రశ్నార్థకంగా ఉంది. 4 స్థానాల కోసం సుమారు 60మందికిపైగానే ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరునేతలు ఢిల్లీలోనే నెలల తరబడి మకాం వేసి లాబీయింగ్ జరుపుతున్నారు. వారిద్వారానే జాబితా తిరస్కరణకు గురైన విషయం బయటకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలు వేర్వేరుగా పంపిన జాబితాలలో సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నవారికి సమాజసేవలో కొనసాగుతున్నవారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. మైనారిటీల కోటాలో కేవలం ముస్లింల పేర్లను మాత్రమే పరిగణించడం కూడా తిరస్కరించేందుకు కారణమైనట్లు తెలుస్తోంది. క్రిస్టియన్ సామాజికవర్గం నుంచి కూడా అభ్యంతరాలు ఉన్నట్లు తెలుస్తోంది.

పలుమార్లు ప్రభుత్వం సిఫారసు చేసిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాను రాజ్‌భవన్ తిరస్కరించిన విషయం తెలిసిందే. పరిషత్‌కు భిన్నమైన రంగాల సాధకులను సిఫారసు చేయాల్సి ఉంటుంది. కానీ రాజకీయాల్లో కొనసాగుతూ గత ఎన్నికల్లో టిక్కెట్‌లు దక్కనివారు, ఓడినవారికి అవకాశం ఇవ్వాలనే రీతిలో వ్యవహరించడంతోనే గవర్నర్‌నుంచి తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే.

పరిషత్‌లో కాంగ్రెస్ సభ్యులు యూబీ వెంకటేశ్, ప్రకాశ్‌రాథోడ్, జేడీఎస్ నుంచి నామినేట్ అయిన తిప్పేస్వామి, బీజేపీ నుంచి నామినేట్ అయిన సీపీయోగేశ్వర్ పదవీకాలం ముగిసింది. సీపీ యోగేశ్వర్‌కు ఇంకా ఎమ్మెల్సీగా కొనసాగే గడువు ఉన్నా చన్నపట్టణ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన విషయం తెలిసిందే. పరిషత్‌లో మొత్తం 75మంది సభ్యులు ఉంటారు. ప్రస్తుతం 4 స్థానాలను కలుపుకొంటే పరిషత్‌లో కాంగ్రెస్ బలం 37కు చేరనుంది. బీజేపీకి 29, జేడీఎస్‌కు 9మంది సభ్యులు ఉన్నారు. సభాపతి బీజేపీకి చెందినవారు కావడంతో కాంగ్రెస్, బీజేపీ-జేడీఎస్‌ల కూటమికి చెరో 37మంది సభ్యులు అవుతారు.

రాష్ట్రంనుంచి అభ్యర్థుల జాబితా పంపాలంటే ప్రభుత్వం తరఫున సీఎం సిద్దరామయ్య, రాష్ట్ర పార్టీ తరపున కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్‌లతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్థానికులు కావడంతో ఆయన సిఫారసులకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి ఢిల్లీకి పంపిన జాబితాలో కాంగ్రెస్ సీనియర్ నేత వేణుగోపాల్, వినయ్‌కార్తీక్, బీఎల్ శంకర్, రఘునందన్ రామణ్ణ, డీజీ సాగర్, కే శివకుమార్, దినేశ్ అమీన్‌మట్టు, ఆగాఖాన్‌లతోపాటు కొందరు పారిశ్రామికవేత్తలు, మరికొందరు నేతల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలోకొందరు జర్నలిజంనుంచి వెళ్లినవారు కూడా ఉన్నారు. కానీ క్రిస్టియన్‌ల పేరు ఒకటి కూడా లేకపోవడం విమర్శలకు కారణమవుతోంది. దళితులలో మాదిగ సముదాయానికి అవకాశం కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి.



ఓడినవారు ఎగువసభకు సరికాదు..

శాసనసభ ఎన్నికల్లో ఓడినవారు, లేదా టిక్కెట్ దక్కనివారిని పరిషత్‌కు ఎంపిక చేసే విధానంపై సభాపతి బసవరాజ హొరట్టి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈమేరకు డీసీఎం, కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు ప్రత్యేకమైన లేఖ రాశారు. విధానపరిషత్‌కు ఎంపిక చేసేవారిలో సాహిత్యం, కళలు, సంగీతం, మీడియా రంగానికి చెందినవారిని ప్రాధాన్యం ఇవ్వాలని లేఖలో ప్రస్తావించారు. 4 దశాబ్దాలుగా పరిషత్‌లో ఉన్నానని గతంలో సాహిత్యం, సంగీత కళలు, విద్యా నిపుణులు, మీడియారంగంలో సామాజికసేవ చేసేవారికి అవకాశం ఇచ్చేవారన్నారు. ఇటీవల ఈ విధానాన్ని ఎందుకో పక్కనపెట్టారని లేఖలో ప్రస్తావించారు. భిన్నమైన రంగాల్లో సాధకులను నామినేట్ చేసి రాజ్యాంగబద్ధమైన పదవికి అవకాశం కల్పించాలనే విధానం ఉందన్నారు. ప్రస్తుతం నలుగురిని ఎంపిక చేసేందుకు వీలున్నందున నాలుగు రంగాలకు చెందినవాకి అవకాశం ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. ఎంపిక పారదర్శకంగా ఉండాలని కోరారు.

రెండు రోజుల్లో ఢిల్లీకి సీఎం.. విస్తరణకేనా..?

నాలుగు ఎమ్మెల్సీ స్థానాల భర్తీతోపాటు కేబినెట్ విస్తరణ అంశాలపై చర్చించేందుకు 6న శుక్రవారం ఢిల్లీ వెళ్లనున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోపాటు అగ్రనేతలంతా ఢిల్లీలోనే ఉంటున్నందున రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కొలిక్కి తెచ్చేందుకు సీఎం సిద్దరామయ్య ఢిల్లీ వెళ్లనున్నారు. ఒకటి రెండు రోజులు అక్కడే ఉండి అన్నీ తేల్చుకునే అవకాశం ఉంది. ఎమ్మెల్సీలుగా నలుగురి పేర్లను ఖరారు చేయించడంతోపాటు దాదాపు ఏడాదిగా వాయిదా పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణ అంశం కూడా ఖరారు చేసేలాంటి చర్చలు జరగవచ్చునని తెలుస్తోంది. మార్పులు జరిపితే ప్రస్తుతం కేబినెట్‌లోని మంత్రులు రహీంఖాన్, కేఎన్ రాజణ్ణ, ఆర్‌బీ తిమ్మాపుర, శరణబసప్ప దర్శనాపుర, మహదేవప్ప, లక్ష్మీ హెబ్బాళ్కర్‌లను తొలగించే అవకాశాలు ఉన్నాయి. పరిషత్ నుంచి బీకే హరిప్రసాద్‌కు కేబినెట్ చోటు దాదాపు ఖరారు కానుంది. ప్రస్తుతం పరిషత్ నుంచి మంత్రిగా బోసరాజు మాత్రమే ఉన్నారు. దీంతో ఆయన సభానాయకుడిగాను వ్యవహరిస్తున్నారు. ఒకవేళ బీకే హరిప్రసాద్ మంత్రి అయితే సభా నాయకుడి హోదా దక్కనుంది. అరసికెరె ఎమ్మెల్యే శివలింగేగౌడకు పలుమార్లు కేబినెట్‌లో చేర్చుకుంటామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆయనకు అవకాశం దక్కనుంది.

19న నంది కొండలపై కేబినెట్ భేటీ.. !



బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రాంతాలవారీగా మంత్రివర్గ సమావేశాలు జరుపుతున్న సీఎం సిద్దరామయ్య త్వరలోనే నంది కొండలపై కేబినెట్ భేటీ నిర్వహించాని నిర్ణయించారు. మంత్రివర్గ భేటీ అంటే సాధారణంగా విధానసౌధలో జరపడం సంప్రదాయంగా ఉండేది. కానీ రాష్ట్రంలో దశాబ్దాలకాలంగా వివిధ ప్రాంతాల్లో కేబినెట్ సమావేశాలు జరపడం ఆనవాయితీగా మారింది. ఇటీవలే కలబురగి, తాజాగా చామరాజనగర జిల్లా, మలెమహదేశ్వరలో మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఈనెల 19న చిక్కబళ్ళాపుర నగరానికి అనుబంధంగా ఉండే నంది కొండలపై కేబినెట్ భేటీ నిర్వహించదలిచారు. తద్వారా చిక్కబళ్ళాపుర, కోలారు, తుమకూరు, చిత్రదుర్గ జిల్లాలకు సంబంధించిన సమస్యలను చర్చించేందుకు అవకాశం ఉంటుందని శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ అభిప్రాయపడుతున్నారు. నంది కొండలకు ప్రత్యేక చరిత్ర ఉంది. మహాత్మాగాంధీ స్వాతంత్ర్యానికి పూర్వం కొన్నిరోజులు నందికొండలలో ఉంటూ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కార్యాచరణ సాగించారు. 1984లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావును బర్తరఫ్ చేసిన కాలంలోనూ రాజకీయమంతా ఇక్కడే సాగింది. 1986లో రెండో సార్క్ రౌండ్‌టేబుల్ సమావేశం కూడా జరిగింది. గతంలో జేహెచ్ పటేల్ సీఎంగా ఉన్నప్పుడు మాగడి రోడ్డు తిప్పగొండనహళ్ళి అతిథిగృహంలోనూ, ఎస్ఎం కృష్ణ మైసూరులోని హెచ్‌డీకోటె పరిధిలోనూ, ఆర్ గుండూరావు పాలనలో కలబురగి, బెళగావి, మైసూరులలో సభలు జరిపారు. అదే తరహాలోనే నంది కొండలలోనూ మరో రెండువారాలలో కేబినెట్ సమావేశం జరిపేందుకు మంత్రిమండలి సిద్ధమవుతున్నారు.

బడిత ఫీజులు..!



● కార్పొరేట్ పాఠశాలల ఇష్టారాజ్యం
● భారీగా ఫీజుల పెంపు
● నిబంధనలకు నీళ్లొదిలిన యాజమాన్యాలు
● ఎల్‌కేజీ, యూకేజీలకూ రూ.వేలల్లో..
● మధ్యతరగతి ప్రజలు విలవిల

బళ్లారి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మే 28 నుంచి తెరుచుకున్నాయి. అయితే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. జూన్ వచ్చిందంటే చాలు బడి ఫీజులతో మధ్య తరగతి ప్రజలు విలవిలలాడాల్సిందే. ముఖ్యంగా కార్పొరేట్ స్కూళ్లు ఈ సారి భారీగా ఫీజులు పెంచేశారు. పిల్లలకు మంచి విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆశలను ప్రైవేటు స్కూల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. స్కూల్ ఫీజు, బస్సుఫీజు, పుస్తకాల ఫీజు, లైబ్రరీ ఫీజు కల్చరల్ ఫీజు ఇలా సవాలక్ష పేర్లు చెప్పి తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నారు. డొనేషన్లు, సీటు రిజర్వేషన్, బుక్స్ ఫీజు అంటూ పలు రకాల పేర్లతో ఫీజుల మోత మోగిస్తున్నాయి. కనీస సౌకర్యాలు కూడా లేని ప్రైవేటు స్కూల్స్ రూ. వేళ్లకు వేలు ఫీజులు లాగేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు మంచి స్కూల్‌లో చదివించాలనే ఏకైక ఉద్దేశంతో అప్పు సొప్పు చేసి పిల్లలకు ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యావ్యాపారం చేస్తున్న కొన్ని ప్రైవేటు పాఠశాలల మరీ విలువలు లేకుండా వ్యవహరిస్తుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బళ్లారి, విజయనగర, చిత్రదుర్గం, కొప్పళ, రాయచూరు తదితర జిల్లాలో ప్రైవేటు స్కూల్స్ లో ఫీజులు ఇష్టానుసారంగా లాగుతున్నారు. ఏకంగా ఎల్‌కేజీకే రూ. 24 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తూ ఓ పాఠశాల రికార్డులో కెక్కింది. సీబీఎస్‌ఈ, ఐసీఎస్ఈ సిలబస్ అంటూ భారీగా వసూలు చేస్తున్నారు. సామాన్య, మధ్యతరగతి పిల్లల తల్లిదండ్రులు ఫీజులు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఇక మధ్యతరగి ఉద్యోగుల పరిస్థితి అంతే ఇంత పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించుకోలేక అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్నారు. చాలా వరకు పాఠశాలల్లో నిబంధనలు పాటించడం లేదు. పాఠశాలల్లో పిల్లలు కూర్చొవడానికి కనీస సౌకర్యాలు లేవు, వెంటిలేటర్లు, విద్యుత్తు ప్రమాదం సంబవించినప్పుడు ఉండాల్సిన ముందస్తు జాగ్రత్తలు ఇలాంటి ఏమీ లేకుండానే కొన్ని పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు అనుమతులు ఇచ్చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం విద్యనుబోధించేందుకు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. వీటికి తోడు ప్రభుత్వ పాఠశాల్లో రిజల్టు బాగా తగ్గిపోతుంది. రాష్ట్రంలో 27వ శాతానికి పడిపోయింది. దీంతో చాలా మంది ప్రభుత్వ పాఠశాలలపై విముఖత చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను మెరుగు పరిచి మధ్యతరగతిపై భారం తగ్గియాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. నిబంధలను పాటించకుండా, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డాక్టరేట్‌ను నిరాకరించిన
మంత్రి సతీశ్ జార్కిహొళి



బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఓపెన్ యూనివర్సిటీ ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళికి గౌరవ డాక్టరేట్‌ను అందించేందుకు సిద్ధం కాగా ఆయన నిరాకరించారు. ఈమేరకు ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తనకు ఎంతో సామాజిక బాధ్యత ఉందని, గౌరవమైన బాధ్యతలు పొందేందుకు చాలా కాలం ఉందని, తాను గౌరవ డాక్టరేట్‌ను తీసుకోలేనని అభిప్రాయపడ్డారు. కర్ణాటక ఓపెన్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌లు మార్చి 27న తనను కలిశారన్నారు. గౌరవ డాక్టరేట్ ఇవ్వదలిచామని, అందుకు కమిటీ తీర్మానించినట్లు తెలియజేశారన్నారు. సన్మానం చేసి గౌరవ డాక్టరేట్ ఇవ్వదలచినట్లు వివరించారన్నారు. సమాజంలో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని వాటిపై నిరంతరంగా పర్యవేక్షిస్తున్నానన్నారు. గౌరవ డాక్టరేట్ పొందదలచుకోలేదని, తన నిర్ణయాన్ని స్వాగతిస్తారని భావిస్తున్నట్లు యూనివర్సిటీకి లేఖ పంపానన్నారు.


చామరాజపేటలోని మలె మహదేశ్వర ఆలయం వద్ద టెంకాయలు కొడుతున్న అభిమానులు

విజయోస్తు..!

● రాష్ట్రమంతా క్రికెట్ ఫీవర్
● ఐపీఎల్ ఫైనల్లో ఆర్‌సీబీ గెలవాలని పూజలు, ర్యాలీలు
● టీవీల వద్ద అతుక్కుపోయిన అభిమానులు
7

దక్షిణ కన్నడలో మిడ్‌నైట్ ఆపరేషన్?

● అల్లర్లను అణిచివేయడానికి అర్ధరాత్రి పోలీసుల గస్తీ

బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లాలో ఇటీవల మూడు హత్యలు చోటు చేసుకున్న తరుణంలో శాంతిభద్రతలు కాపాడేందుకు రాష్ట్రప్రభుత్వం పోలీసు అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. మంగళూరు నగర పోలీస్ కమిషనర్, జిల్లా ఎస్పీలు కార్యాచరణను ప్రారంభించారు. 'మిడ్‌నైట్ ఆపరేషన్' పేరిట హిందూ, ముస్లిం నేతల ఇళ్లకు వెళ్లి జీపీఎస్ ఫొటో తీసుకునే ప్రక్రియను ప్రారంభించారు. సోమవారం రాత్రి వివిధ ప్రాంతాల్లో జీపీఎస్ ఫొటో తీసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ అరుణ్ తెలిపారు. పదేళ్లగా జిల్లాలో జరిగిన హత్యల సమగ్ర సమాచారాన్ని సేకరించి మత ఘర్షణల్లో పాల్గొన్న ముఖ్యులు, కార్యకర్తల జాబితా సిద్ధం చేస్తున్నామన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ సిబ్బంది వారి ఫొటో, లొకేషన్‌తోపాటు వారి సమాచారాన్ని తెలుసుకోదలిచారు. ప్రతిరోజూ ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లాలో శాంతిభద్రతలు కొలిక్కి వచ్చేవరకు ఈ ప్రక్రియ కొనసాగించదలిచామన్నారు. ఎవరు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. విశ్వహిందూ పరిషత్, వివిధ సంఘాల పేరిట ఎవరైనా వేధించినా ఇతరత్రా చర్యలకు పాల్పడినా పకడ్బందీగా కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీసుల ప్రక్రియకు కడబ పోలీస్ స్టేషన్ పరిధిలో అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. కడబ పోలీస్ స్టేషన్ ముందు స్థానికులు ఆందోళన చేశారు ఈమేరకు అక్కడ పోలీసు అధికారులు మరోసారి మా విధి నిర్వహణకు అడ్డుగా వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుత్తూరుకు చెందిన విశ్వహిందూ పరిషత్ దక్షిణ ప్రాంత ఉపాధ్యక్షుడు పూవప్ప (80) ఇంటికి వెళ్లి అర్ధరాత్రి ఫొటోలు తీశారు. ఇదే విషయమై పూవప్ప మాట్లాడుతూ రాఘవేంద్ర మఠంలో నిద్రిస్తుండగా వచ్చారని, టవల్ చుట్టుకున్నానని అలాగే ఫొటో తీశారన్నారు. హిందూ కార్యకర్తలే టార్గెట్ చేసి కేసులు నమోదు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా 21మంది హిందూ, 15మంది ముస్లిం ప్రముఖులను దక్షిణకన్నడ జిల్లానుంచి బహిష్కరించే చర్యలపైనా సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు నక్సల్స్ నియంత్రణ తరహాలోనే మంగళూరులో మతపరమైన హత్యల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు కూడా హిందూ సామాజికవర్గాన్ని టార్గెట్ చేసినట్లు ఉందని బీజేపీ వర్గాలు మండిపడ్డాయి.


లాఠీ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

లక్షణంగా వ్యాపారం..!

● బక్రీద్ సందర్భంగా జోరుగా గొర్రెల అమ్మకాలు
● ఆంధ్ర, తమిళనాడుల నుంచి విరివిగా రాక
● రూ.లక్షకు పైగా పలుకుతున్న జీవాలు


ఈద్గా మైదానంలో అమ్మకానికి ఉంచిన పొట్టేలు

బక్రీద్ పండుగ సమీపిస్తున్న తరుణంలో బెంగళూరు నగరంలోని పలు ప్రాంతాలలో గొర్రెల వ్యాపారం జోరందుకుంది. బక్రీద్ పండుగ వేళ గొర్రెలను బలి ఇచ్చే సంప్రదాయం ఉంది. దీంతో ఏటా లక్షలాది గొర్రెల విక్రయం సాగుతుంది. ముస్లింలు గొర్రెల కొనుగోళ్లకు తండోపతండాలుగా వస్తున్నారు.
7


కొనుగోలు చేస్తున్న ముస్లింలు

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

ఐదుగురికి తీవ్రగాయాలు


గాయపడిన కుమార్


వెంకటరమణ


ఉత్తన్న

తనకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగసానిపల్లి సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ గోపి తెలిపిన మేరకు కదిరి నుంచి మదనపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న నలుగురు ప్రయాణికులు, లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కదిరికి చెందిన కుమార్, పూల బజార్‌కు చెందిన లక్ష్మీనారాయణ, తనకల్లు మండలంలోని పాల్యం వాండ్లపల్లికి చెందిన తుపాకుల వెంకటరమణ, అన్నమయ్యజిల్లా మొలకలచెరువు మండలం అడివినాయినచెరువుపల్లికి చెందిన గొంది ఉత్తన్న, లారీ డ్రైవర్ రామాంజనేయులు ఉన్నారు. వందేమాతం అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీడ్రైవర్ రామాంజనేయులు, గొందిపల్లి ఉత్తన్నలను మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జింకను ఢీకొట్టిన ద్విచక్రవాహనం

యువకుడికి గాయాలు, వన్యప్రాణి మృతి


జింక కళేబరం

గుంతకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రసన్న బైక్‌పై వెళ్తూ జింకను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక భీమిరెడ్డి కాలనీకి చెందిన ప్రసన్న ఉరవకొండలో ఓ ప్రైవేటు ఐటీఐలో చదివి పాసయ్యాడు. సర్టిఫికెట్ల కోసం మంగళవారం ఉరవకొండకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా వజ్రకరూరు మండలం రాగులపాడు గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డుగా జింక రావడంతో దాన్ని ఢీకొట్టి, కింద పడ్డాడు. దీంతో ప్రసన్న తలకు తీవ్ర గాయమవగా, జింక అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు 108 సర్వీసుకు సమాచారమందించగా, క్షతగాత్రుడిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి రెఫర్ చేశారు.

చెరుకు తోట దగ్ధం... రూ.10 లక్షల నష్టం


దగ్ధమవుతున్న చెరుకుతోట

గార్లదిన్నె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదేడు గ్రామ సమీపంలో చెరుకు తోట దగ్ధమై రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు... అనంతపురానికి చెందిన శాంతరాజు బూదేడు వద్ద ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని డ్రిప్, స్ప్రిక్లర్లు ఏర్పాటు చేసుకుని చెరుకు పంట సాగుచేశాడు. అయితే మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు చెరుకు తోటకు నిప్పంటుకుని పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. బాధిత కౌలు రైతు శాంతరాజు నుంచి సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే చెరుకు తోట పూర్తిగా అగ్నికి ఆహుతైంది.

నిమ్మ చెట్లు నరికి... డ్రిప్ పరికరాల దహనం


దుండగులు నరికివేసిన నిమ్మచెట్లు


కాలిపోయిన డ్రిప్పు పైపులు

యాడికి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిమానుపల్లి గ్రామంలో అన్నదమ్ములైన రైతులు శంకర్, లోకేష్‌లకు చెందిన 15నిమ్మ చెట్లు నరికివేసి, రూ.2లక్షలు విలువజేసే డ్రిప్పు పరికరాలను కాల్చివేసిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. సాయంత్రం వరకు నిమ్మ తోటలో పనులు చేసి వచ్చామని బాధిత రైతులు తెలిపారు. మంగళవారం ఉదయం నిమ్మతోటలో గడ్డిమందు కొట్టడానికి వెళ్లగా చెట్లను నరికివేసి ఉన్నట్లు గమనించామన్నారు. తోటలో నిల్వ ఉంచిన డ్రిప్ పైపులను కాల్చివేశారని తెలిపారు. మూడేళ్ల వయస్సు ఉన్న 15నిమ్మచెట్లను దుండగులు నరికివేశారని, సుమారు రూ.2లక్షలు విలువజేసే డ్రిప్ పరికరాలు కాల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు నేలపైన వెయిట్ అండ్ సి అని రాసి వెళ్లారని రైతులు తెలిపారు. తాము ఏ రాజకీయపార్టీకి చెందినవారు కాదని, గ్రామంలో ఎవరితో కూడా ఎటువంటి గొడవలు లేవని, దుండగులు ఎందుకు ఇలా చేశారో తెలియడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్మచెట్లు నరికివేసిన సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటరమణయ్య సిబ్బందితో వెళ్లి దుండగులు నరికివేసిన నిమ్మచెట్లను కాల్చివేసిన డ్రిప్ పైపులను పరిశీలించారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి నాటక పోటీలకు నమోదు చేసుకోండి

అనంతపురం కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబరు 2 నుంచి ఆరో తేదీ వరకు నిర్వహించనున్న నాటక పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైఖేల్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన నాటకరంగ కళాకారులు అర్హులన్నారు. అనంతపురంలోని కృష్ణ కళామందిర్‌లో పౌరాణిక పద్య నాటకాలు, ఏకాంక పద్య నాటకాల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. పౌరాణిక పద్య నాటకాల విభాగంలో ప్రథమ స్థానానికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.70వేలు, తృతీయ స్థానానికి రూ.40వేలు నగదు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఏకాంక నాటకాల విభాగంలో మొదటి స్థానానికి రూ.20వేలు, ద్వితీయ స్థానానికి రూ.15వేలు, తృతీయ స్థానానికి రూ.10వేలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఇక పోటీల్లో స్ర్కూట్నీ ద్వారా ఎంపిక చేయబడి ప్రదర్శించే పౌరాణిక పద్య నాటకానికి రూ.15వేలు, ఏకాంక నాటకానికి రూ.2వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల నాటక సంస్థలు, సంఘాల వారు 63006 54184 నెంబర్‌ను సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురంరూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33,300 ధర పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.19వేలు అమ్ముడుపోయినట్లు తెలిపారు.

తస్మాత్ జాగ్రత్త

- రాబోయే మూడు నెలలు భారీ వర్షాలు కురిసే అవకాశం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వచ్చే మూడు నెలల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, సహాయక చర్యలకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై మంగళవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుకోని ప్రమాదం సంభవిస్తే త్వరగా చేపట్టాల్సిన చర్యలపై సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మూడురోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఆర్డీవోలు, వారానికి ఒకసారి డివిజన్ స్థాయిలో అధికారులతో సమీక్షించి, తగు సూచనలు చేయాలన్నారు. అలాగే జిల్లాలో చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నీటిపారుదల శాఖల ఏడీలు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిల్లో పరిశీలించాలన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లో రోడ్లు, మురుగు నీటికాలువల వ్యవస్థలను పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో ప్రతిరోజు పారిశుధ్య పనులు నిర్వహించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ శాఖాధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల ఈదురుగాలులు, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, స్తంభాలు నేలకొరగడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, వైర్లు నేలకు వాలడం జరిగితే వెంటనే పునరుద్ధరించడానికి సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పశుసంవర్ధకశాఖ శుభదాస్, తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం 2025-26కి గాను పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైనవారు, ఇంటర్‌లో ఫెయిల్ అయిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 7382633687, 7702705721 కు సంప్రదించాలని తెలిపారు.

ప్రవేశాలకు నేడు లాటరీ

అనంతపురం సెంట్రల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది గిరిజన గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు బుధవారం లాటరీ తీయనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో మూడో తరగతినుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీ ఉన్న సీట్లను భర్తీచేయడానికి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. దరఖాస్తులు ఎక్కువ రావడంతో లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తారన్నారు. అనంతపురంలోని నవోదయ కాలనీలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల(బాలికల)లో ఉదయం 10 గంటలకు లాటరీ తీస్తామని తెలిపారు.

డీజిల్ దొంగల ముఠా గుట్టు రట్టు

- వ్యవసాయ తోటలో నిల్వ
- 1500 లీటర్ల డీజిల్ పట్టివేత
- ముగ్గురు నిందితుల అరెస్టు


స్వాధీనం చేసుకున్న డీజిల్ డ్రమ్ములతో పోలీసులు

చెన్నేకొత్తపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): డీజిల్ దొంగల ముఠా గుట్టు రట్టు అయ్యింది. రామగిరి మండలం పెనుబోలు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ వ్యవసాయ తోట కేంద్రంగా డీజిల్ అక్రమ వ్యాపారం సాగిస్తున్న వైనాన్ని పోలీసులు కనుగొన్నారు. చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు...చెన్నేకొత్తపల్లి సమీపంలోని ఓ దాబా వద్ద సోమవారం రాత్రి డ్రైవర్ లారీని ఆపి నిద్రపోయాడు. తిరిగి మంగళవారం తెల్లవారు జామున లేచి గమనించగా 300లీటర్లు డీజిల్ మాయమైంది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సిబ్బందితో కలిసి మండలంలోని దామాజిపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో వెళ్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేశారు. అందులో 90 లీటర్ల డీజిల్ దొరికింది. కారులో ఉన్న బసవరాజు అనే వ్యక్తిని విచారించగా సీకేపల్లి సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద ఉంచిన డీజిల్‌ను దొంగిలించానని, పెనుబోలు వద్ద రాము అనే వ్యక్తికి విక్రయించడానికి వెళ్తున్నట్లు పోలీసులకు తెలిపాడు. దీంతో రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో పెనుబోలుకు వెళ్లి రామును తమదైన శైలిలో విచారించడంతో డీజిల్ అక్రమ వ్యాపారం బట్టబయలైంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకిత్, బిహార్‌కు చెందిన మరికొందరితో కలిసి డీజిల్ దొంగిలిస్తున్నట్లు వెల్లడైంది. పెనుబోలు వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న రాము తోటలో దొంగిలించిన డీజిల్ నిల్వ ఉంచుతున్నట్లు తేలింది. దీంతో అక్కడ డ్రమ్ముల్లో ఉంచిన 1500 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. రాము, అంకిత్, బసవరాజును అరెస్టు చేశారు. ఆరునెలల నుంచి జాతీయ రహదారి పక్కన ఆపి ఉన్న వాహనాల నుంచి డీజిల్‌ను దొంగిలించి అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్ఐ తెలిపారు. డీజిల్‌ను 2వేల లీటర్ల వరకు డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన తరువాత తాడిపత్రి, గుత్తి తదితర ప్రాంతాలలోని కొన్ని ప్రైవేటు కంపెనీలకు విక్రయించేవారని ఎస్ఐ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచి నట్లు ఎస్ఐ తెలిపారు. డీజిల్ దొంగతనం, అక్రమ వ్యాపారంతో సంబంధం ఉన్న ఇద్దరు బిహారీలు పరారైనట్లు తెలిసింది.

నేడు మెము రైలు ప్రారంభం

- అనంత నుంచి బెంగళూరుకు ప్రయాణం సులభతరం



అనంతపురం, న్యూటౌన్ జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నుంచి బెంగళూరు వెళ్లే మెము రైలు (66560) సర్వీసును ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ మేరకు రైల్వే యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తి కాగానే షెడ్యూల్ టైం మేరకు మధ్యాహ్నం 2.10 అనంతపురం స్టేషన్ నుంచి రైలు బయలుదేరి రాత్రి 7.50 గంటలకు కేఎస్ఆర్ బెంగళూరు చేరనుంది. మెమూ రైలు ప్రారంభమైతే కేవలం రూ.50తో జిల్లా కేంద్రం నుంచి బెంగళూరు చేరుకునే అవకాశం ఉంటుంది. ఇది పేద, మధ్యతరగతి ప్రయాణికులకు చాలా ప్రయోజకరంగా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రైలు సర్వీసు కోసం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అలుపెరగని ప్రయత్నం చేసి, విజయవంతం అయ్యారు. ప్రారంభోత్సవానికి ఎంపీతో పాటు స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిదులు గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తాతో పాటు ఇతర అధికారులు హాజరుకానున్నారు.

బీఎస్ఎఫ్ జవాన్ మామకు భూమి అప్పగింత

- సర్వే చేయించిన రెవెన్యూ అధికారులు


భూమిని సర్వే చేస్తున్న అధికారులు

అమరాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ కబ్జా చేసిన భూమిని బీఎస్ఎఫ్ జవాన్ మామ కదిరప్పకు అధికారులు మంగళవారం అప్పగించారు. మండలంలోని కే శివరం గ్రామంలో బీఎస్ఎఫ్ జవాన్ నరసింహమూర్తి మామ కదిరప్ప భూమిని అదే గ్రామానికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు కబ్జా చేశాడు. దీనిపై బీఎస్ఎఫ్ జవాన్ ఆవేదన వ్యక్తం చేస్తూ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో విడుదల చేశాడు. అది వైరల్ కావడంతో అధికార యంత్రాంగం శివరం గ్రామానికి పరుగులు పెట్టింది. తహసీల్దార్ లక్ష్మీనరసింహ పొలం రికార్డులను పరిశీలించారు. ఇదివరకే కోర్టు కూడా ఆ భూమి కదిరప్పకు చెందినదే అనే తీర్పు ఇచ్చిన విషయాన్ని తెలుసుకున్నారు. అప్పుడే పోలీస్ బందోబస్తు మధ్య సర్వేయర్‌ల ద్వారా కొలతలు వేసి హద్దు రాళ్లను నాటించి కదిరప్పకు భూమి అప్పగించారు. ఎన్నో సంవత్సరాల కల నేటికి నెరవేరిందని బీఎస్ఎఫ్ జవాన్ నరసింహమూర్తి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్, ఆర్ఐ విన్సెంట్‌పాల్, మండల సర్వేయర్లు పుట్టరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా... ప్రమోషన్లు ఇప్పించు..

- గాంధీ విగ్రహానికి సంఘాల నేతల వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు వెంటనే వచ్చేలా చూడాలంటూ పలువురు అర్హులైన ఎస్‌జీటీలు గాంధీ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పలు సంఘాల నాయకులు ఆరోరోజు శారదా స్కూల్‌లో నిరసన తెలిపిన తర్వాత క్లాక్‌టవర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. తర్వాత సంఘాల నేతలు మాట్లాడుతూ 2023లో తాత్కాలిక ప్రమోషన్లు ఇచ్చారన్నారు. అలా ఇచ్చిన 230 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పోస్టులకు సంబంధించి ఖాళీలు చూపాలని కోరారు. డీఎస్సీకి 103 పోస్టులు పోగా...మిగిలిన పోస్టులు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. అర్హులైన సీనియర్ ఎస్‌జీటీలకు అన్యాయం జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సూర్యుడు, చంద్రశేఖర్, జయపాల్‌నాయుడు, నరసింహులు, లింగమయ్య, రఫీ, అంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33,300 ధర పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 468టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.


చలో ఎల్‌ఓసీ యాత్ర సభ్యులకు ఘన స్వాగతం


యాత్రలో పాల్గొన్న సభ్యులతో ఈఓఆర్డీ తదితరులు

అనంతపురంరూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చలో ఎల్‌ఓసీ బైకు యాత్ర సభ్యులకు నగర శివారులో ఘన స్వాగతం లభించింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా కేరళకు చెందిన కొంతమంది కెప్టెన్ రాంనాథ్‌జీ నేతృత్వంలో కేరళలోని కాలాడీ ప్రాంతం నుంచి చలో ఎల్‌ఓసీ యాత్ర చేపట్టారు. అందులో భాగంగా ఈయాత్ర మంగళవారం మండలంలోని సోములదొడ్డికి చేరుకుంది. వీరికి ఆత్మకూరు ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగి వెంకటరమణ, వెంకటేశ్వర్లు తదితరులు స్వాగతం పలికారు. ఇస్కాన్ టెంపుల్ ఆవరణలో అల్పాహారం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతం.. పహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఉగ్రదాడిలో 26మంది మృతిచెందితే 26 బుల్లెట్ బైక్‌లతో యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. యాత్రలో పలు చోట్ల ప్రజలు మద్దతుగా యాత్రలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈక్రమంలో 26మందితో ప్రారంభమైన యాత్ర 35మందికి చేరిందన్నారు. యాత్ర ముగిసేలోపు మరింత మంది పాల్గొనే వీలుందన్నారు. జమ్ముకశ్మీర్‌లోని శారదమట్ వరకు యాత్ర సాగుతుందన్నారు. అక్కడ మిలటరీ క్యాంపును చేరుకుని సైనికులను కలుసుకుని సంఘీభావం తెలియజేస్తామన్నారు.

అక్రమార్కుడు ఆదినారాయణే..!

- ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలను వదులుకుంటా
- మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి



అనంతపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): భూ అక్రమార్కుడు ఆదినారాయణేనని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. ఆదినారాయణ భూ అక్రమాలపైన, తనపై చేసిన ఆరోపణల పైన సిట్టింగ్ జడ్జి లేదా ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరి భూముల జోలికీ పోవాల్సిన అవసరం తనకు లేదని పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్నానని, ఏ మచ్చా లేకుండా ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు సేవ చేస్తున్నానని వివరించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎవరు కష్టాల్లో ఉన్నా ఆర్థికంగా సాయం చేస్తూ, వారి కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నానని పేర్కొన్నారు. జిల్లాలో విద్యాసంస్థలను స్థాపించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉచిత విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పించానని పేర్కొన్నారు. తనది ఒక వ్యవస్థ అని, తాను ఎంతో పద్ధతిగా ఉంటానని, ఎవరిజోలికీ పోనని అన్నారు. ఈ మధ్య గొడ్డుమర్రి ఆదినారాయణ అనే వ్యక్తి అనవసరంగా, ఆధారాలు లేకుండా తనపై అభాండాలు వేస్తున్నారని, తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది సంఘాల నాయకులకు నిజాలు చెప్పకుండా, వారిని ప్రలోభపెట్టి అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని అన్నారు. తమ గ్లోబల్ హార్టికల్చర్ కంపెనీలో ఏడుగురు డైరెక్టర్లల్లో ఆదినారాయణ ఒకరని, తమ కంపెనీలో మిగతా డైరెక్టర్లకు తెలియకుండా, నిబంధనలకు విరుద్ధంగా, ఫేక్ రెజల్యూషన్ చేసి కంపెనీకి సంబంధించిన 100 ఎకరాలకు పైగా భూమిని తన భార్య, బావమరిది, మామ, అన్న పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. ఆ భూమిని 26 మందికి అమ్మి, వారిని కూడా మోసగించారని ఆరోపించారు. ఆదినారాయణ నుంచి తాము నష్టపోయిన భూమిని న్యాయస్థానం ద్వారా దక్కించుకుంటామని వివరించారు. ఆ భూమిలో ఒక సెంటు కాజేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంఘాల నాయకులు వాస్తవాలు గమనించాలని కోరారు. ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణపల్లికి చెందిన 50 మందికిపైగా అమాయక గిరిజన రైతులకు సంబంధించిన 170 ఎకరాలను దౌర్జన్యంగా ఆదినారాయణ, ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట 1బి అడంగల్ చేయించారని, బ్యాంకుల్లో రూ.కోట్ల రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. అనంత లక్ష్మి కళాశాల ఎదురుగా సుమారు 50 ఎకరాల భూమిని అక్రమంగా పొందిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కియ చుట్టూ పదుల సంఖ్యలో రైతులను బెదిరించి, వారి భూములను ఆన్‌లైన్ చేసుకోలేదా అని ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి నాటక పోటీలకు నమోదు చేసుకోండి

అనంతపురం కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబరు 2 నుంచి ఆరో తేదీ వరకు నిర్వహించనున్న నాటక పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైఖేల్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన నాటకరంగ కళాకారులు అర్హులన్నారు. అనంతపురంలోని కృష్ణ కళామందిర్‌లో పౌరాణిక పద్య నాటకాలు, ఏకాంక పద్య నాటకాల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. పౌరాణిక పద్య నాటకాల విభాగంలో ప్రథమ స్థానానికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.70వేలు, తృతీయ స్థానానికి రూ.40వేలు నగదు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఏకాంక నాటకాల విభాగంలో మొదటి స్థానానికి రూ.20వేలు, ద్వితీయ స్థానానికి రూ.15వేలు, తృతీయ స్థానానికి రూ.10వేలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఇక పోటీల్లో స్ర్కూట్నీ ద్వారా ఎంపిక చేయబడి ప్రదర్శించే పౌరాణిక పద్య నాటకానికి రూ.15వేలు, ఏకాంక నాటకానికి రూ.2వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల నాటక సంస్థలు, సంఘాల వారు 63006 54184 నెంబర్‌ను సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గోరక్షణ చట్టాలు కఠినంగా అమలు చేయాలి

- వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గోసంరక్షణ, వీహెచ్‌పీ నాయకులు

అనంతపురం కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గోరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకట రత్నమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన జిల్లా గోరక్షా ప్రముఖ్ సోమశేఖర్‌తో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోసంరక్షణ చట్టాన్ని అమలు చేశారన్నారు. రాష్ట్ర విభజనానంతరం తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే ఈ చట్టం అమలులో ఉందన్నారు. అయితే కొన్ని హిందూయేతర సామాజిక పండుగల సందర్భంగా గోవులను వధిస్తున్నారని, అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ముస్లిం పండుగల కోసం వాహనాలలో గోవులు, ఎద్దులు, లేగదూడలను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి, వాహన యజమానులకు జరిమానాలతోపాటు జైలుశిక్ష వంటి కఠిన చర్యలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేని కబేళాలను మూసివేయించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రమణబాబు, కార్యదర్శి విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

నూతన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత నూతన్ సమర్థ్ బాహ్లా 1936 జూన్ 4న ముంబైలో మరాఠీ కుటుంబంలో జన్మించారు. హిందీ సినీరంగంలో సుమారు నాలుగు దశాబ్దాల పాటు రాణించిన సుందరాంగి. ఉత్తమనటిగా ఐదుసార్లు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. 14వ యేట 1950లో ఆమె తల్లి దర్శకత్వం వహించిన 'హమారి బేటీ' సినిమాతో తెరంగేట్రం చేశారు. సుజాత, మిలన్, అనారి, తేరే ఘర్‌కే సామ్నె, తదితర సినిమాలు ఎంతో గుర్తింపునిచ్చాయి. ఆమె కుమారుడు మోనిష్ బాహ్లా కూడా సినీ, బుల్లితెర నటుడు. కాగా ఆమె 1991 ఫిబ్రవరి 21న కన్నుమూశారు.

ఎస్పీ బాలసుబ్రమణ్యం (జయంతి)



ఎస్పీబీగా, బాలుగా చిరపరిచితులైన గాన గంధర్వుడిగా పేరొందిన శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రమణ్యం 1946 జూన్ 4న నెల్లూరు జిల్లా కోనేటమ్మ గ్రామంలో జన్మించారు. తనదైన గాత్రంతో నేపథ్య గాయకుడిగా దశాబ్దాలపాటు శ్రోతలను రంజింపచేశారు. బుల్లితెర వ్యాఖ్యత, సంగీత దర్శకుడు, నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్, సినీ నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో 40వేలకు పైగా పాటలు పాడారు. ఉత్తమ నేపథ్య గాయకుడిగా 6 జాతీయ సినీ పురస్కారాలు, నంది అవార్డులు, ఎన్టీఆర్ నేషనల్ అవార్డు సహా 'పద్మశ్రీ' పురస్కారాలు అందుకున్నారు. 2020 సెప్టెంబరు 25న కన్నుమూశారు. మరణానంతరం 'పద్మవిభూషణ్' ప్రకటించారు.

ఆరుద్ర (వర్ధంతి)




కళాప్రపూర్ణ గ్రహీత 'ఆరుద్ర' 1925 ఆగస్టు 31న విశాఖపట్నంలో జన్మించారు. అసలు పేరు భాగవతుల సదాశివ శంకరశాస్త్రి. శ్రీశ్రీ తర్వాత అంతగా యువ తరంపై ఎక్కువ ముద్ర పడిన అభ్యుదయ కవి, పండితుడు, పరిశోధకుడు, నాటక కర్త, విమర్శకుడు. సంగీతం, నాట్యంపై రచనలు ఆరుద్ర అభినివేశాన్ని పట్టి చూపిస్తాయి. కవి, పరి శోధకుడిగా నవ్యత కోసం పరితపించిన నిత్య శోధ కుడు, హేతువాది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆరుద్ర ఆ సంస్థ అభివృద్ధికోసం ఎంతో కృషి చేశారు. సుమారు 4వేల సినిమాపాటలు రాశారు. 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' గ్రంథం ఎంతో సాహితీ పరిశోధకులకు ఉపయుక్త మైనది. 1998 జూన్ 4న కన్నుమూశారు.

అనిల్ అంబాని (పుట్టినరోజు)



అనిల్ అంబాని 1959 జూన్ 4న జన్మించారు. రిలయెన్స్ ఇండస్ట్రీస్ అధినేత ధీరూబాయి అంబానీ కుమారుడు. ప్రస్తుతం రిలయెన్స్ ఏడీఏ గ్రూప్‌కు ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. దేశంలో పేరొందిన రిలయెన్స్ కమ్యూనికేషన్స్, రిలయెన్స్ పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కేపిటల్ సంస్థలు ఏర్పాటు చేసి ఆయా రంగాలలో తనదైన ముద్ర చాటుకున్నారు. 2004-06 మధ్య ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. పారిశ్రామికవేత్తగా పలు పురస్కారాలు అందుకున్నారు.

ఏంజెలినా జోలి (పుట్టినరోజు)



ప్రముఖ అమెరికా నటి ఏంజెలినా జోలి 1975 జూన్ 4న జన్మించారు. సినీ దర్శకురాలిగానే కాక మానవతావాదిగాను గుర్తింపు పొందారు. అకాడమీ అవార్డు, 3 గోల్డెన్ గ్లోబ్ అవార్డులు అందుకున్నారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న నటీమణులలో ఒకరు. పలు నాటకాలు రచించి దర్శకత్వం వహించారు. అంతేకాక విద్య, మహిళా హక్కులు, తదితర అంశాలపై తన గళం వినిపిస్తారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంపిగెహళ్ళి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో హైడ్రో గాంజా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సీసీబీ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. రూ.13లక్షల విలువైన గంజాయితో కేరళకు చెందిన ఇద్దరు ఎంబీఏ విద్యార్థులను అరెస్టు చేశారు. విచారణలో విలాసాలకు అలవాటు పడి కేరళనుంచి కొంతమందిద్వారా గంజాయి తెప్పించుకుని విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 1.200 కేజీల గంజాయి, 220 గ్రాముల హైడ్రో గంజాయి, త్రాసు, 2 మొబైళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఓ కాలేజీ వద్ద గంజాయి విక్రయిస్తుండగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.



ఆలయం వద్ద కరవే బృందం



ఆర్‌సీబీ టీ షర్టులు కొంటున్న యువకులు

విజయోస్తు..!

బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కి మద్దతుగా బెంగళూరు నగరవ్యాప్తంగా మంగళవారం ఉదయం పలు చోట్ల క్రికెట్ అభిమానులు వివిధ ఆలయాలలో పూజలు జరిపించారు. ప్రత్యేకించి చామరాజపేటలోని మలెమహదేశ్వర ఆలయం వద్ద అభిమానులు ప్లకార్డులు ప్రదర్శించి టెంకాయలు కొట్టారు. మరోవైపు కూడళ్లలో ఆర్‌సీబీ క్రికెటర్ల టీ షర్టులను విక్రయించారు.

బంగారపేట: ఐపీఎల్ ఫైనల్స్‌లో ఆర్‌సీబీ జట్టు తలపడుతున్న నేపథ్యంలో విజయం సాధించాలని కోరుతూ పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో కర్ణాటక రక్షణా వేదిక (కరవే) ఆధ్వర్యంలో కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం పూజలు జరిపించారు. అనంతరం కరవే తాలూకా అధ్యక్షుడు రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే లీగ్, అన్ని పోటీలలో అద్భుత ప్రదర్శన ద్వారా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజ్, నగర అధ్యక్షుడు చలపతి, ఆర్ మధుసూధన్, లీలావతి, వసంత రెడ్డి, హరీశ్, నవీన్, గుండ, ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.



విజయనగర్‌లోని బాలగంగాధరనాథ స్వామి క్రీడా మైదానంలో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ వీక్షిస్తున్న అభిమానులు

సమగ్ర అభివృద్ధే లక్ష్యం: జేడీయూ



మాట్లాడుతున్న జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిమా పటేల్

బాగేపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణం, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, పాలన ఈ ఐదు అంశాలతో సర్వోదయ పరికల్పనతో వచ్చే ఎన్నికల్లో జేడీయూ సరికొత్త ఒరవడిని సృష్టించడం ఖాయమని జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిమా పటేల్ అభిప్రాయపడ్డారు. ఆగ్నేయ పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి డాక్టర్ కే నాగరాజు తరపున మాజీ ఎమ్మెల్యే మహిమా పటేల్ ప్రచారం చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. విధానపరిషత్‌కు ఆగ్నేయ పట్టభద్రుల విభాగానికి 2026 జూన్‌లో ఎన్నికలు జరగనున్నాయని కోలారు జిల్లాకు చెందిన డాక్టర్ నాగరాజ్ జేడీయూ అభ్యర్థి అని మహిమా పటేల్ ప్రకటించారు. జేడీయూ రాష్ట్ర యువ విభాగం అధ్యక్షుడు అయిన నాగరాజ్‌ను బరిలోకి దింపుతున్నట్టు తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు ఎన్నికలు ఎదుర్కొన్న అనుభవం ఉందన్నారు. డబ్బు, తాయిలాలు పంచకనే పోటీ చేస్తున్నామన్నారు. కోలారు, చిత్రదుర్గ, చిక్కబళ్ళాపుర, తుమకూరు జిల్లాల్లో ఇప్పటికే ప్రచారం ప్రారంభించామన్నారు. లంచగొడితనం పోయేందుకు కొత్తప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికలు సరళంగా, పారదర్శకంగా ఉండాలన్నదే తమ అభిమతమన్నారు. ఆగ్నేయపట్టభద్రుల స్థానానికి ఇప్పటినుంచి కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. ఆప్, రైతుసంఘం ఇతర నాయకుల మద్దతు కోరుతున్నామన్నారు. అభ్యర్థి డాక్టర్ కే నాగరాజు మాట్లాడుతూ సమగ్ర అభివృద్ధి ఆలోచనతో అన్నిశాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్‌కు బదులుగా పాత పెన్షన్ అమలు చేయాలని, గెస్ట్ లెక్చరర్‌లు, టీచర్‌లను పర్మనెంట్ చేయాలని, జ్యోతి సంజీవిని పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో జేడీయూ మహిళా విభాగం అధ్యక్షురాలు కళావతి, నారాయణస్వామి, అంబరీశ్, మల్లమ్మ, కేఆర్ఎస్ పార్టీ బాలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూములకోసం.. రైతుల నిరసన



పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయించిన రైతులు

శిడ్లఘట్ట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయదలిచిన కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలెప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ) కు భూములు ఇవ్వడంపై రైతులు కొంతమంది అనుకూలంగాను, మరికొందరు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివాదం ఇరువర్గాల మధ్య తారస్థాయికి చేరింది. ఇలా కొంతమంది రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో కొంతమందిని అరెస్టు చేయడానికి పోలీసులు సిద్ధమయ్యారంటూ పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులను పోలీస్‌స్టేషన్ లోపలికి రప్పించి ఉన్నతాధికారులతో చర్చలు జరిపి పరిష్కరించారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర కార్యాధ్యక్షుడు భక్తరహళ్ళి బైరేగౌడ మాట్లాడుతూ తాము కేఐఏడీబీకి భూములు ఇచ్చేది లేదన్నారు, అయితే కొంతమంది కేఐఏడీబీకి భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, వారి పోరాటానికి మా పోరాటానికి సంబంధం లేదన్నారు. ఇద్దరు వ్యక్తులు భూముల అంశాలనికి సంబంధించి మొబైల్‌లో మాట్లాడుకున్నారని, దీనికి కేసు నమోదు చేయడం, అరెస్టు చేయడానికి ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉందని మరిన్ని చర్యలు వద్దని, పారదర్శకంగా చర్యలు చేపడతామని డీఎస్పీ మురళిధర్ తెలిపారన్నారు.

ఘనంగా బసవేశ్వరస్వామి ఆలయ సంప్రోక్షణ

శిడ్లఘట్ట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హనుమంతపుర గ్రామంలో బసవేశ్వరస్వామి ఆలయ సంప్రోక్షణ, నూతన విమాన గోపుర, శిఖర కళశ స్థాపన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. విశేష హోమాలు, దేవుడికి పుష్పాలంకరణ, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దివంగత వీరభద్రప్ప కుమారులు, కుటుంబీకులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రవికుమార్, మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ, కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ శశిధర్ మునియప్ప, కేఎంఎఫ్ డైరెక్టర్ శ్రీనివాసరామయ్య, సమాజసేవకుడు వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్



పట్టాలు పొందిన విద్యార్థులు

ముళబాగిలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉత్తర విశ్వవిద్యాలయంలో వాసవి అకాడమీ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన వందమంది విద్యార్థులకు యూపీఎస్‌సీ, కేపీఎస్‌సీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్టు ఉపకులపతి నిరంజన్ వానళ్ళి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో పట్టాలు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బెంగళూరు వాసవి అకాడమీ ఇతరులకు కోచింగ్ ఇవ్వడానికి రూ.1.25లక్షలు ఫీజుగా ఉందని అయితే బెంగళూరు ఉత్తర విశ్వవిద్యాలయానికి చెందిన ప్రతి సంవత్సరం 100మంది విద్యార్థులకు ఉచిత అవకాశం కల్పిస్తుందన్నారు. ఇక్కడ కోచింగ్ పొందినవారు తప్పకుండా ఉత్తీర్ణులవుతున్నారన్నారు. డిగ్రీ పూర్తి చేసిన 12శాతం మంది మాత్రమే పీజీలో చేరుతున్నారని, అత్యధికశాతం యువతులు పెళ్ళిళ్లు చేసుకుంటుండగా కొంతమంది ఉద్యోగాలలో చేరుతున్నారన్నారు. బెంగళూరు ఉత్తర విశ్వవిద్యాలయం గుణాత్మకతకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సిండికేట్ సభ్యుడు వెంకటేశ్ మాట్లాడుతూ వివి పరిధిలో 280 కళాశాలలు ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ మునివెంకటప్ప మాట్లాడుతూ కళాశాలలో తొలిసారిగా పట్టాల ప్రదానోత్సవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. బిఏ, బికామ్, బీఎస్‌సి మొత్తం 273మంది విద్యార్థులు పట్టాలు పొందారు. సీనియర్ అధ్యాపకులు ఎంఎన్ మూర్తి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణప్ప, శివరామేగౌడ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్

బోధన, పరిశోధనలకే ప్రాధాన్యం ఇవ్వాలి

- విద్యార్థులకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పిలుపు

బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలు బోధన, పరిశోధనల కార్యాచరణకు ప్రాధాన్యత ఇవ్వాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పిలుపునిచ్చారు. నగరంలో మంగళవారం ఓపి జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ 2025 సుస్థిర అభివృద్ధి నివేదికను లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ విశ్వవిద్యాలయాలు నిరంతర కార్యాచరణతోపాటు ఆధునాతన సాంకేతికతను విద్యార్థులకు అనువు చేయాలన్నారు. ఓపి జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ చాన్స్‌లర్ రాజ్‌కుమార్, ఆర్‌వి యూనివర్సిటీ చాన్స్‌లర్ ఏవీఎస్ మూర్తిలు పాల్గొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చర్చాగోష్ఠి జరిపారు. రేవస్త్ర ఫౌండర్ భావనా పింగళి, ఆర్‌వి ఉపకులపతి ద్వారికాప్రసాద్ ఉనియల్, జ్యోత్సన బెలియప్ప, మేఘా అరోరా, పాండురంగ ఆచార్య, ప్రశాంత్ నబేసన్, స్మితా చంద్రశేఖరయ్యలు చర్చాగోష్ఠిలో భాగస్వామ్యులయ్యారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: కుంబ్లె

బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని, పర్యావరణ, వన్యజీవి రాయబారిగా ఎంపిక చేయడాన్ని సంతోషంగా భావిస్తున్నానని క్రికెటర్ అనిల్‌కుంబ్లె అన్నారు. మంగళవారం అటవీశాఖమంత్రి ఈశ్వర్‌ఖండ్రెతో అనిల్‌కుంబ్లె భేటీ అయ్యారు. మంత్రి క్వార్టర్స్‌కు అనిల్‌కుంబ్లె రాగా సాదరంగా స్వాగతించారు. రాష్ట్రంలోని అడవులు, వన్యప్రాణుల వివరాలను అనిల్‌కుంబ్లె అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనిల్‌కుంబ్లె మాట్లాడుతూ.. పర్యావరణ రక్షణ అందరిబాధ్యత కావాలన్నారు. అడవులను సంరక్షించడం, చెట్లను పెంచడం వంటి చర్యలు బాల్యంనుంచి తనకు ఇష్టమన్నారు. రాయబారిగా రాష్ట్రమంతటా తిరిగి చైతన్యం కలిగిస్తానన్నారు.

ఆర్మీకి మద్దతుగా ర్యాలీ



ర్యాలీలో జాతీయ పతాకాలతో స్థానికులు

దొమ్మసంద్ర, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాదుల దాడి అనంతరం భారతీయ సైన్యం నిర్వహించి ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై ఆర్మీకి మద్దతుగా గౌరవం సమర్పించేలా సర్జాపురలో భారీ తిరంగా ర్యాలీ, బైక్ ర్యాలీ నిర్వహించారు. కేరళ రాష్ట్రం ఆదిగురు శంకరాచార్య జన్మస్థలం కాలహాడి నుంచి కాశ్మీర్ శారదాపీఠం వరకు బుల్లెట్‌ర్యాలీ కొనసాగనుంది. రమానంద్ నేతృత్వంలో ర్యాలీ నిర్వహిస్తున్నారు. కార్యక్రమ నిర్వాహకులు భరత్‌గౌడ మాట్లాడుతూ ఉగ్రవాదులను అణిచివేసేందుకు భారతసైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో వారికి నైతిక మద్దతుగా, ప్రజలలో దేశభక్తి పెంపొందించేలా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. రిటైర్డు సైనికుడు వేణు మాట్లాడుతూ కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో 26మంది పర్యాటకులు బలయ్యారని విచారం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రతిగా ఆర్మీ ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు బుద్ధి చెప్పిందన్నారు. భారతీయ సైనికులకు గౌరవంగా బుల్లెట్ ర్యాలీ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రమానంద్ మాట్లాడుతూ వందలాదిమంది ర్యాలీలో పాల్గొన్నారన్నారు. సర్జాపుర, దొమ్మసంద్ర తదితర ప్రాంతాల వాసులు పాల్గొన్నారు. జై జవాన్ - జై కిసాన్, జై భారత సేన అనే నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. బీజేపీ ప్రముఖులు జయణ్ణ, భరత్‌గౌడ, మురళిధర, వేణుగోపాల్, మాజీ సైనికుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాశ్ తదితరులు

బాగేపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఏ పంట మంచి దిగుబడి సాధించాలన్నా నాణ్యమైన విత్తనాలతోనే సాధ్యమని అశోక్ కంపెనీ అధ్యయన విభాగం నిపుణుడు డాక్టర్ ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దేవరగుడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జి చర్లోపల్లి గ్రామం రైతు శ్రీనాథ్ తోటలో క్షేత్రోత్సవ కార్యక్రమంలో రైతులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. ఎరువులు, విత్తనాల వాడకం, దిగుబడి తదితర అంశాలపై చర్చించారు. కాగా అశోక్ కంపెనీ బీట్‌రూట్, బీన్స్, చెండుమల్లి, కొత్తిమీర తదితర విత్తనాలు నాణ్యమైనవి ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిద్దరాము మాట్లాడుతూ ప్రత్యేకించి కొత్తిమీర విత్తనాలు వేస్తే ఐదు రోజులకే మొలక వచ్చి నెలరోజులకే కోత సాధ్యమన్నారు. కాగా, పలువురు రైతులు స్పందిస్తూ గతంతో పోలిస్తే అశోక్ కంపెనీ విత్తనాల ధరలు పెరిగాయని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సంస్థ అధికారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



కిటకిటలాడుతున్న గొర్రెల మార్కెట్





అమ్మకానికి ఉంచిన పొట్టేళ్లు

లక్షణంగా వ్యాపారం..!

బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సమీపిస్తున్న తరుణంలో నగరంలోని పలు ప్రాంతాలలో గొర్రెల వ్యాపారం జోరందుకుంది. బక్రీద్ పండుగ వేళ గొర్రెలను బలి ఇచ్చే సంప్రదాయం ఉంది. దీంతో ఏటా లక్షలాది గొర్రెల విక్రయం నగరంలో సాగుతుంది. ప్రధానంగా చామరాజపేటలోని ఈద్గా మైదానం, ఆర్‌టీ నగర్ సమీపంలోని జేసీనగర్ ప్రాంతం, బన్నేరుఘట్ట రోడ్డు, ట్యానరీరోడ్డు సహా వివిధ ప్రాంతాలలో గొర్రెల విక్రయాలు సాగుతాయి. రాష్ట్రంలోని ఉత్తరకర్ణాటక ప్రాంతాలు, తుమకూరు, చిత్రదుర్గ, శివమొగ్గ, దావణగెరె జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల పొరుగు జిల్లాలనుంచి గొర్రెలను విక్రయించేందుకు తీసుకొస్తున్నారు. రైతులు, దళారీలు నేరుగా గొర్రెలను విక్రయిస్తున్నారు. శనివారం బక్రీద్ పండుగ కావడంతో మూడు రోజులుగా గొర్రెల విక్రయాలు జోరందుకున్నాయి. రూ.60వేలనుంచి రూ.1.30 లక్షల విలువైన గొర్రెలు మార్కెట్‌లో అమ్ముడుపోతున్నాయి. వివిధ జాతుల గొర్రెలు కొనుగోలు చేస్తున్నారు. అమీన్ ఘడ్ గొర్రె రూ.1.10లక్షలకుపైగా ధర పలుకుతుండగా హరిహర, కశ్మీర, బన్నూరు, నాటి తదితర రకం గొర్రెలు రూ.70వేలకు పైగా ధరలు ఉన్నాయి. గొర్రెలను కొనుగోలు చేసినవారు వాటిని ఇళ్లకు తీసుకెళ్లి మేపుతున్నారు. ఇలా నగరంలో ముస్లింల ఇంటింటా గొర్రెలు కనిపిస్తున్నాయి. చామరాజపేటలోని మైదానంలో 10రోజులకుపైగా గొర్రెల విక్రయాలు సాగుతుండగా మంగళవారంతో ఖాళీ చేయించారు. పండుగ రోజున మైదానంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించనుండడంతో పరిశుభ్రం చేస్తున్నారు.





తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1598.60	1,577.59
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10,989	637
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	245	25
నీటి నిల్వ (టీఎంసీలు)	19.77	3.41

అధిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

● ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి: జిల్లా విపత్తు నిర్వహణ సమావేశంలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రుతుపవన వర్షాలు ప్రారంభం కావడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా చూడాలని జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ ఛైర్మన్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేశ్వన్ వీడియో ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లావిపత్తు నిర్వహణ అథారిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ఈసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, కాబట్టి వరదలు, ప్రాణనష్టం, పంట, గృహనష్టాలను నివారించడానికి అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని తాలూకా తహసీల్దార్లు అవసరమైన చర్యలు తీసుకుని సమస్యలు ఏర్పడినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. నది ఒడ్డున ఉన్న గ్రామాల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. మునిగిపోయే అవకాశంఉన్న గ్రామాలను గుర్తించాలి. కంప్లి ,సిరుగుప్ప వంటి నదీ తీర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కురుగోడు ప్రాంతంలోని సిద్ధమనహళ్ళి గ్రామంలో భారీ వర్షం కురిస్తే నాడు వంతెన మునిగిపోయింది. దీనికి సంబంధించి స్థానికులను హెచ్చరించాలన్నారు. ప్రమాదం సంభవించే గ్రామాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని, ఆయా గ్రామ నిర్వాహకుల సహకారంతో అక్కడి పిల్లలు,పెద్దలు,పశువుల గణన నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. సంరక్షణ కేంద్రాలను తెరవడానికి స్థలాలను గుర్తించాలని, ఇతర అనుబంధ సామాగ్రిని సిద్ధం చేయాలన్నారు. ఈసారి జిల్లాల విత్తనాల ధరలు పెరిగే అవకాశం ఉందని, డీఏపీ ఎరువులకు డిమాండ్ పెరగుతుందన్నారు. రైతులకు బదులుగా మిశ్రమ ఎరువులు వాడటానికి బదులుగా సేంద్రీయ ఎరువులపై అవగాహన కల్పించాలన్నారు. రైతుసంప్రదింపు కేంద్రాల్లో రైతులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, వ్యవసాయ సంయుక్త డైరెక్టర్ సోమసుందర్, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సంతోష్ సప్పండి, నీటిపారుదల ,ప్రజా పనులు, ఆర్‌డీపీఆర్ ,జెఎస్కామ్ సహా వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు ,అన్ని తాలూకా తహసీల్దార్లు పాల్గొన్నారు.

విక్రేతల సంఘం అధ్యక్షుడిగా తిమ్మనగౌడ



అధ్యక్షుడిని సన్మానిస్తున్న రైతు సంఘం నాయకులు

బళ్లారిరూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తు విక్రేతల సంఘం అధ్యక్షుడిగా తిమ్మనగౌడను రైతు సంఘం నాయకులు నిర్ణయించారు. మంగళవారం బళ్లారి నగరంలోని బసవేశ్వర నగర్ నివాసంలో ఆయన్ని జిల్లా కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం హసురుసేన కార్య అధ్యక్షుడు సింధిగేరి గోవిందప్ప నాయక్‌తో పాటు మహిళా సంఘం సభ్యులు పద్మావతి, రోహిణి తదితరులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా తిమ్మనగౌడ మాట్లాడుతూ.. రైతులకు మద్దతు ధర లభించి నష్టాలు పాలు కలగకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

సిరుగుప్ప, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు పొందగలమని, క్రైమ్ ఎస్ఐ శ్రీనివాస సేవలు ఎంతో అమోఘమని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప అన్నారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలో క్రైమ్ ఎస్ఐ గురుభవనంలో పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. శ్రీనివాస దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బసవభూషణ స్వాములు, కోటిరెడ్డి, గోపాల్‌రెడ్డి, బీజేపీ తాలుకా అధ్యక్షుడు మల్లికార్జునస్వామి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరిబసప్ప, స్నేహబలగ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో సదుపాయాలు కల్పించాలి : ఏఐడీఎస్ఓ



నిరసన తెలుపుతున్న ఏఐడీఎస్ఓ సభ్యులు

బళ్లారి సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బళ్లారి తాలూకాలోని తిరుమల నగర్ క్యాంప్ ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని ఏఐడీఎస్ఓ డిమాండ్ చేసింది. మంగళవారం నగరంలోని పీల్డ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ కార్యాలయం ముందు సంస్థ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లాధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ పిల్లల్లో విలువలను పెంపొందించడం, సమాజంలో వారిని మంచి వ్యక్తులుగామార్చడం ,విద్య బాధ్యత అని అన్నారు. విద్యను పూర్తిగా ఉచితంగా అందించడం ప్రభుత్వ బాధ్యత అని, ఇటీవల ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పుకోవడం గర్హణీయమన్నారు. తిరుమల నగర్ పాఠశాలలో అధికంగా పేదలు, కూలీల పిల్లలు చదువుతున్నారని, అక్కడ సదుపాయాలు కల్పించి చదువు చెప్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ క్యాంప్ ప్రభుత్వ తెలుగు లోయర్ ప్రైమరీ స్కూల్లో సౌకర్యాలు లేకుండా పోయింది. విద్య నాణ్యతను కోల్పోతుందన్నారు. సరైన శౌచాలయాలు లేక అమ్మాయిలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇక్కడ తెలుగు మాధ్యమం మాత్రమే ఉందని, 5వ తరగతి తరువాత పిల్లలు తదుపరి విద్య కోసం శంకర్‌బండేకు వెళ్లాల్సి వస్తుందన్నారు. అక్కడ తెలుగు మీడియం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తుకు ఎటువంటి సమస్య రాకుండా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తిరుమల నగర్ క్యాంప్ స్కూల్ భవనాన్ని మరమ్మతు చేసి, గదుల సంఖ్యను పెంచాలన్నారు. పాఠశాలకు కొత్త కాంపౌండ్ నిర్మించాలన్నారు. నిరసనలో ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.శాంతి, ఉమ, తిరుమల నగర్ క్యాంప్ మల్లికార్జున, దూలప్ప, గిరిజమ్మ, వన్నూరమ్మ పాల్గొన్నారు.



హంపి ఆర్ట్ ల్యాబ్స్‌లో కళాఖండాలను పరిశీలిస్తున్న పర్యాటకులు

ఆకట్టుకుంటున్న కళాప్రదర్శన

బళ్లారి సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జేఎస్‌డబ్ల్యూ హంపి ల్యాబ్స్‌లో ప్రఖ్యాత కళాకారుడు ధ్రువ ఆచార్య 'ది జర్నీ ఈజ్ హోమ్' పేరుతో నిర్వహిస్తున్న కళా ప్రదర్శన పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కళా విమర్శకుడు గిరీష్ షహనే నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన జూన్ 1నుంచి సెప్టెంబరు 30వరకు కొనసాగనుంది. ఈ ప్రత్యేకమైన ప్రదర్శన ధ్రువ ఆచార్య కళాకృతులను పరిచయం చేస్తుంది. ది జర్నీ ఈజ్ హోమ్ ఆదర్శాలు పర్యావరణ నిబద్ధత,పట్టణ జీవితంలోని సవాళ్ళువారి కళ ఆధ్యాత్మికతను ప్రతిబింబిస్తుంది. అదనంగా ఇది సార్వత్రిక బావోద్వేగాలతో ప్రతిధ్వనించిపే శక్తిని కలిగి ఉందని హంపి ఆర్ట్ ల్యాబ్స్ చెబుతోంది. ఈ సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ అధ్యక్షురాలు సంగీత జిందాల్ మాట్లాడుతూ.. ఈ శీర్షిక బౌద్ధ సూత్రాల వ్యక్తీకరణను ప్రతిబింబిస్తుందన్నారు. ఈ ప్రదర్శనలో జేఎస్‌డబ్ల్యూ యొక్క కొన్ని ముఖ్యమైన కళాకృతులు కూడా ఉన్నాయి. ధ్రువ ఆచార్య చిత్రాలు ఆశ, శక్తి యొక్క కాంతిని ప్రతిబింబిస్తాయి. అవి స్త్రీ యొక్క అంతర్గత భావాలు, భావోద్వేగాలను ప్రతిబింబిస్తాయి. హంపి ఆర్ట్ ల్యాబ్‌లో ధ్రువ కళను ప్రదర్శించడం సంతోషంగా ఉందన్నారు. ఈప్రదర్శన నా కళా జీవితంలోని వివిధ దశల సంక్షిప్త అవలోకనం. ఇక్కడ చూపబడిన ప్రతి చిత్రం ప్రేమ, కష్టాలు, నష్టం, మాతృత్వం, మహిళల స్థితిగతులు, పర్యావరణం గురించి తీవ్రమైన ఆలోచనలను ప్రతిబింబిస్తాయన్నారు. ఈ కథలకు ఊపిరి పీల్చుకునే అవకాశం ఇచ్చినందుకు హంపి ఆర్ట్ ల్యాబ్స్, జేఎస్‌డబ్ల్యూ పౌండేషన్‌లకు నేను కృతజ్ఞుడను అని ధ్రువ ఆచార్య అన్నారు.

కోతుల దాడిలో ఉపాధ్యాయుడికి గాయాలు



గాయపడ్డ పాండురంగ

కంప్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని సిరిగేరిలో మంగళవారం కోతుల దాడిలో వ్యక్తికి గాయాలయ్యాయి. ముద్దటనూరు క్యాంపులోని నవ గ్రామంలో పాండురంగ అనే అతిథి ఉపాధ్యాయుడిపై నల్లముచ్చు కోతులు దాడిచేశాయి. దీంతో అతని చేతులు కాళ్లకు గాయాలయ్యాయి. అతను కేకలు వేయడంతో వదిలి చెట్లపైకి వెళ్లాయి. స్థానికులు సిరిగేరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తరలించారు. ఉత్తమ చికిత్స కోసం అతన్ని బళ్లారి జిల్లా ఆస్పత్రికి తరలించారు. దాదాపు రెండు మూడు నెలలుగా కోతుల బెడద ప్రజల ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అటవీశాఖ అధికారులు కోతులను పట్టుకుని అడవిలోకి వదలాలని ప్రజలు కోరారు. ఈ విషయం తెలిసిన వెంటనే, జోనల్ ఫారెస్ట్ ఆఫీసర్ కౌశిక్ దళవాయి, డిప్యూటీ ఫారెస్ట్ జోనల్ ఆఫీసర్ అంబన్న నాయక సిబ్బందిని సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స పొందుతున్న పాండురంగ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ప్రభుత్వం నుండి పరిహారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. నల్లకోతులను పట్టుకోవడానికి ఏర్పాట్లు చేస్తామని, స్థానిక గ్రామ పంచాయతీ సహాయంతో ఆపరేషన్ చేస్తామని తెలిపారు.



అర్పన అక్షిత్‌రాథోడ్ ప్రద్యోత్ భూమిక ఐశ్వర్యపాటిల్

జేఈఈలో సత్తాచాటిన సర్ ఎంవీ కళాశాల విద్యార్థులు

బళ్లారి సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 పరీక్షల్లో సర్ ఎంవీ కళాశాల, సమూహ సంస్థ దావణగెరె విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. కళాశాల విద్యార్థిని అర్పన ఎస్ కేటగిరి విభాగంలో 18వ ర్యాంక్, అక్షిత్‌రాథోడ్ 224వ ర్యాంకు, ప్రద్యోత్ 457, భూమికా 960ర్యాంకు, ఐశ్వర్య పాటిల్ 1002ర్యాంకు, రాజేశ్ 1129, నెలవిగి యోగేశ్వర 2398, స్వాతిక్ 3260. అర్హాన్ 3497, కుశాల్ దీప్,3634,వినయ్‌కోరి 4050, గానవి 4757, అదితి 5054, చాణక్య ఈశ్వర్ 5411, కీర్తన్‌రాజ్‌జకనూర్ 5570, కౌటేశ్ హణసి 5741, చన్న బసవ 5834,సృష్టి 6748, అద్విక్ 7376, ప్రథమ్‌గడియార్ 7749, యశస్ 7975, ఆర్యభట్ 9253వ ర్యాంకు సాధించడంపై కళాశాల సిబ్బంది, ప్రిన్సిపాల్ అభినందించారు.



రాజేష్ యోగీశ్వర సాత్వీక్ అర్హాన్ కుశాల్ దీప్

వైభవంగా ఎర్రితాత పూల రథోత్సవం



గంధం అలంకరణలో ఎర్రితాత, రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బళ్లారిరూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన చెళ్లగుర్కి ఎర్రితాత పూల రథోత్సవాన్ని సోమవారం సాయంత్రం భక్తుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటకతో పాటు పలు గ్రామాల నుండి భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి పూల రథోత్సవం దేవస్థానం నుంచి ఎదురు బసవన్న దేవస్థానం వరకు ఊరేగించారు. కార్యక్రమానికి భక్తజన సమూహంగా పెద్ద ఎత్తున వీరాధి సంతుల భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలనగౌడ తెలిపారు. భక్తులు విశేషంగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పరమదేవనహళ్లి, మోకా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రుద్రప్ప, తిమ్మారెడ్డి, కాళింగ పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మద్యం తాగి.. డ్రైవింగ్ చేయొద్దు: డీఎస్పీ

కంప్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్లు ఖనిజం తరలించే సమయంలో మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నారని, దీంతోనే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని డీఎస్పీ గోఖలే అభిప్రాయపడ్డారు. సండూరులో మంగళవారం పోలీసులు లారీ డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారి మంజునాథ మాట్లాడుతూ.. అమ్ముతున్న దుకాణాలపై ఇప్పటికే దాడులు చేపట్టామన్నారు. జరిమానా విధించి కేసు నమోదు చేశామని తెలిపారు. పోలీసులు, ప్రాంతీయ రవాణా అధికారులు గనుల శాఖ సిబ్బంది ఖనిజ ట్రక్కుల డ్రైవర్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. జరగడంలేదని ఫిర్యాదులున్నాయి. సండూరులో దాదాపు ఆరు వేల లారీలున్నాయి. ప్రతిరోజు వంద నుంచి 200 లారీల డ్రైవర్లపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు అక్రమ మద్యం ప్రధాన కారణం ఎక్సైజ్ అధికారులు అక్రమ మద్యం అమ్మకాలను పూర్తిగా నిషేధించాలన్నారు. ఎం రుద్రగౌడ, అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు తాళూరు గ్రామం జరిమానాలు విధిస్తే డ్రైవర్లను హెచ్చరించారు. మైనింగ్ ప్రాంతాల్లో ప్రమాదాలను నివారించడానికి ఖనిజ రవాణా మార్గాల్లో సాధారణ ప్రజల ప్రాణాలను కాపాడటానికి జిల్లా యంత్రాంగం వెంటనే సండూరులో సబ్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం, సబ్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. సండూరు మైనింగ్ ప్రాంతాలలో తిరిగే ఖనిజ ట్రక్ డ్రైవర్లపై అటవీశాఖ నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రమాదాలను నియంత్రించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారని జోనల్ అటవీ సంరక్షణ అధికారి సయ్యద్ దాదా ఖలందర్ తెలిపారు.



డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

హోసూరు జోన్

బుల్లెట్ ర్యాలీకి స్వాగతం



ర్యాలీకి స్వాగతం పలుకుతున్న యువకులు

హోసూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం నేపథ్యంలో భారత సైనికులకు మద్దతుగా నిర్వహిస్తున్న బుల్లెట్‌ర్యాలీకి ఆత్మీయస్వాగతం పలికారు. కేరళ నుంచి కశ్మీర్‌కు బుల్లెట్‌ర్యాలీ సాగనుంది. హోసూరులో హిందూసంస్థల సంఘాల వారిని ఆత్మీయంగా స్వాగతించారు. కేరళ రాష్ట్రం ఎర్నాకులం జిల్లా కాలడి ప్రాంతం నుంచి 8మంది మహిళలు సహా 26మంది వ్యక్తుల బృందం బుల్లెట్‌పై కశ్మీర్‌కు బయల్దేరారు. వారు రోజుకు 400 కిలోమీటర్లు ప్రయాణించనున్నట్లు తెలిపారు. ఈనెల 12న కశ్మీర్‌కు చేరే అవకాశం ఉందన్నారు.

డీఎంకేలోకి పలువురి చేరిక



ఎమ్మెల్యే ప్రకాశ్ సమక్షంలో పార్టీలో చేరిన కార్యకర్తలు

హోసూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా ఆర్థిక విభాగం జిల్లా అధ్యక్షుడు రాజి నేతృత్వంలో ఎమ్మెల్యే ప్రకాశ్ సమక్షంలో వందమందికి పైగా డీఎంకేలోకి చేరారు. చాలామంది బీజేపీని వీడినవారు కావడం గమనార్హం. డీఎంకే రాష్ట్ర యువజన విభాగం డిప్యూటి ఆర్గనైజర్ శ్రీనివాసన్, కేంద్ర కార్యదర్శులు భాగ్యరాజ్, నగేశ్ పాల్గొన్నారు. సీఎం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్టు పలువురు అభిప్రాయపడ్డారు. డీఎంకేతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అభిప్రాయపడ్డారు.



ఎంజీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్



నివాళి అర్పిస్తున్న కార్మికులు

ఎంజీఆర్‌కు ఘన నివాళి

హోసూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, కరుణానిధి జయంతి సందర్భంగా కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా పార్టీ అభిమానులు, నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అన్ని పంచాయతీలలో మంగళవారం ఎంజీఆర్ చిత్రపటానికి పూల మాలలు సమర్పించారు. కాగా పలుచోట్ల కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. డీఎంకే పార్టీ నిర్వాహకులు మాత్రమే కాకుండా పలు చోట్ల నాయకులు పాల్గొన్నారు. కాగా హోసూరు చంద్రచూడేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రకాశ్ నేతృత్వంలో 2వేలమందికి భోజనం పంపిణీ చేశారు. హోసూరు మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ యువరాజ్, మాజీ ఎమ్మెల్యే మురుగన్, జిల్లా కౌన్సిల్ ఛైర్మన్ యువరాజ్, సుకుమారన్ తదితరులు పాల్గొన్నారు. కలైంగర్ బిరుదు పొందిన ఎంజీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించిన తర్వాత మహిళలకు నూతనవస్త్రాలు అందజేసి, సంక్షేమాలు పంపిణీ చేశారు. యునైటెడ్ లీగ్ కార్యదర్శి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

● వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ

సిరుగుప్ప, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ అధికారులకు సూచించారు. మంగళవారం సిరుగుప్ప పట్టణలో శివు అభివృద్ధి యోజన కార్యాలయం ఆవరణంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాల విక్రయంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజునాథ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎరువులు, విత్తనాలను రైతులకు సకాలంలో అందజేయాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. విత్తన పంపిణీలో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాటిల్, రెహమాన్, బాలాజీనాయక్, పురుషోత్తమరెడ్డి, ఎరువులు, విత్తనాల విక్రయదారుల సంఘం అధ్యక్షులు తిరుమలశెట్టి, నాగన్నగౌడ, చంద్రశేఖర్‌రావు, వీరణ్ణ తితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్రితాత స్వామి మహారథోత్సవం

సిరుగుప్ప, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎర్రితాత మహారథోత్సవం జరిగింది. తాలుకాలోని హావినాళ గ్రామంలో సోమవారం మహారథోత్సవం భక్తుల మధ్య విశేషంగా జరిగింది. తాతకు ఆలయ అర్చకులు పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో రథోత్సవం జరిగింది. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.

డేరాల్లోనే వైద్య పరీక్షలు

కంప్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖ అధికారులు ఆదేశాల మేరకు ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళవారం డేరాల్లో ఉన్న అండి జోగి సమాజ సభ్యులకు డేరాల వద్దకే వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కురుగోడు తాలుకా పరిధిలో కోలూరు క్రాస్ వద్ద డేరాల్లో నివసిస్తున్న అండిజోగి సమాజం వారికి సీహెచ్‌వో భరత్, ఆశా కార్యకర్తలు పరిమళ వెళ్లి వారికి బీపీ, షుగర్, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.